ప్రజాశక్తి
మంగళవారం 11 జులై 2023

నేడు కోలగట్ల జలాసన ప్రదర్శన

హాజరుకానున్న రాష్ట్ర మంత్రులు

ప్రజాశక్తి-విజయనగరం

జాతీయ స్విమ్మింగ్ పూల్‌డే సందర్భంగా స్థానిక కంటోన్మెంట్ ఆక్వా స్టేడియం (స్విమ్మింగ్ పూల్)లో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి జలాసన ప్రదర్శన జరగనుంది. ఇప్పటికే రెండుసార్లు జలాసనం వేయడం ద్వారా యువతను ఆకట్టుకున్న కోలగట్ల, మరోమారు తన ఆసన ప్రదర్శన ద్వారా నేటి తరం దృష్టిని యోగాసనాలవైపు, ఈత వైపు మళ్లించేందుకు కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈ ప్రదర్శన కార్యక్రమంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ, స్పీకర్ తమ్మినేని సీతారాం, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొననున్నారు. కార్యక్రమంలో ప్రతీఒక్కరూ పాల్గొని, విజయవంతం చేయాలని ఆహ్వాన కమిటీ విజ్ఞప్తి చేసింది.

కలెక్టరేట్ ఎదురుగా రహదారిపై మహాధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

రాత్రి టెంట్‌లోనే భోజనాలు చేస్తున్న అంగన్‌వాడీలు

నినాదాలుచేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వా'ఢీ'

- కలెక్టరేట్ వద్ద 36గంటల మహా ధర్నా
- తరలివచ్చిన కార్యకర్తలు, ఆయాలు
- సమస్యలు పరిష్కరించకపోతే మూల్యం తప్పదు
- ప్రభుత్వానికి నాయకుల హెచ్చరిక
- కలెక్టరేట్ ఎదుటే రాత్రి బస .. అక్కడే వంటావార్పూ

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

ఐసిడిఎస్ పరిరక్షణ, ఉద్యోగ భద్రత, కనీస వేతనం కోసం అంగన్‌వాడీలు కదం తొక్కారు. ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు కలెక్టరేట్ వద్ద 36గంటల మహాధర్నా చేపట్టారు. మా గురించి ఆలోచించకపోతే మీ గురించి ఆలోచిస్తామంటూ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మహాధర్నా నేపథ్యంలో ఉదయం 10గంటలకే జిల్లా నలుమూలల నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు బస్సులు, రైళ్లలో తరలివచ్చారు. 11గంటల సమయానికి కలెక్టరేట్ నుంచి గణేష్ కోవెల వరకు రహదారి వేలాది మందితో నిండిపోయింది. సిఐటియు సహా పలు కార్మిక, ఉద్యోగ, విద్యార్థి సంఘాల నాయకులు శిబిరాన్ని సందర్శించి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. అదే స్ఫూర్తితో అంగన్‌వాడీలంతా కలెక్టరేట్ ఎదురుగా ఏర్పాటు చేసుకున్న టెంటులోనే భోజనాలు చేసి అక్కడే బసచేశారు. ఇక ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామంటూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు హెచ్చరించారు. వేతనాల పెంపు, గ్రాడ్యుటీ చెల్లింపు సహా మిగిలిన సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని సిఐటియు నాయకులు హెచ్చరించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు, ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యూటీ అమలు చెయ్యాలని, ఇతర పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన కలెక్టరేట్ ఎదుట సోమవారం అంగన్‌వాడీలంతా 36గంటల మహాధర్నా చేపట్టారు. ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలని, తెలంగాణ రాష్ట్రం మాదిరిగా వేతనాలు పెంచాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని నినదించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, అధ్యక్షులు పి.శంకర్రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు టివి రమణ, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్ తదితరులు ధర్నా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు వి.లక్ష్మి, అధ్యక్ష, కార్యదర్శులు బి.పైడిరాజు, ఎస్. అనసూయ మాట్లాడుతూ 48ఏళ్లగా గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు అనేక సేవలందిస్తున్న అంగన్వాడీలకు ప్రభుత్వం ఉద్యోగభద్రత కల్పించకపోవడం అన్యాయమని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9ఏళ్లలో అంగన్వాడీల సమస్యలు పరిష్కారానికి చొరవ చూపలేదని, పైగా సమస్యలు మరింత జఠిలమయ్యాయని అన్నారు. ఐసిడిఎస్ లక్ష్యానికి విరుద్ధంగా సెంటర్లు కుదించటానికి నూతన విద్యావిధానాన్ని తీసుకువచ్చిందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెంచిందన్నారు. అందుకనుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. తమ యూనియన్ పోరాటాల ఫలితంగా 2018లో అంగన్వాడీ వర్కర్లకు రూ.1500, హెల్పరుకు రూ.750, మినీ వర్కర్‌కు రూ.1250 పెంచనున్నట్టు చెప్పినప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. 2017 నుండి టిఎ బిల్లులు ఇవ్వడం లేదన్నారు. లబ్ధిదారులను కుదించటానికి పోషణ ట్రాక్ యాప్‌ను తీసుకువచ్చిందన్నారు. సమస్యలను పరిష్కరించాలని, పలు మార్లు నిరసన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ప్రభుత్వానికి పట్టలేదన్నారు. 36గంటల నిరవధిక ధర్నాతోనైనా ప్రభుత్వానికి కనువిప్పు కలగాలన్నారు.

మెడికల్ రిప్స్ అసోసియేషన్ నాయకులు శశిధర్, సిఐటియు నాయకులు ఎ.జగన్మోహన్, బి.సుధారాణి, ఎం.శ్రీనివాస, బి.రమణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు, కృష్ణమ్మ, తులసి, రమణమ్మ, విశాలాక్షి, శివలక్ష్మి, మంగ లక్ష్మి, సరళ, వరలక్ష్మి, ఉమా కుమారి, రూపవతి, అరుణా, చెంచు లక్ష్మి, కె.ప్రభావతి తదితరులు ప్రసంగించారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అభివాదం చేస్తున్న అంగన్‌వాడీ యూనియన్, పలు సంఘాల నాయకులు

గ్రామస్తుల ఇబ్బందులను తొలగించాలి

- విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ
- జాతీయ రహదారుల నిర్మాణంపై సమీక్ష

ప్రజాశక్తి-విజయనగరం

జాతీయ రహదారుల నిర్మాణం వల్ల గ్రామస్తులకు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని, అధికారులను రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశించారు. విజయనగరం-రాజమండ్రి 516 జాతీయ రహదారి నిర్మాణం వల్ల తాటిపూడి, మధుపాడ, మదనాపురం, కొత్తవెలగాడ, తామరాపల్లి తదితర సమీప గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కలెక్టర్ ఛాంబర్‌లో సోమవారం, రైతులు, సంబంధిత అధికారులతో సమీక్షా నిర్వహించారు. ముందుగా ఆయా గ్రామాల రైతుల సమస్యలను తెలుసుకున్నారు. జాతీయ రహదారి నిర్మాణం వల్ల మధుపాడ నుండి తాటిపూడి శివాలయానికి రోడ్డు లేకుండా పోయిందని, తాటిపూడి వద్ద పిఎస్ఆర్ పురం కల్వర్టు మూసుకుపోయిందని, యుటిలిటీ రోడ్లు మూసుకుపోయాయని, కాలువ దెబ్బతిన్నదని, ఎప్రోచ్ రోడ్డు కావాలని, సీతమ్మచెరువు నుంచి వర్షపు నీరు బయటకు పోయే కాలువ మూసుకుపోయిందని గ్రామస్తులు తెలిపారు. అనంతరం మంత్రి బొత్స మాట్లాడుతూ, గ్రామస్తులు ప్రస్తావించిన సమస్యలన్నిటినీ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు పోయేందుకు కాలువలను నిర్మించడానికి భూసేకరణ చేయాలని, అందుకు రైతులు కూడా సహకరించాలని మంత్రి సూచించారు. సమావేశంలో జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎంఎల్‌సి డాక్టర్ పి.సురేష్‌బాబు, గజపతినగరం ఎంఎల్ఎ బొత్స అప్పలనరసయ్య, జెసి మయూర్ అశోక్, డిఆర్ఒ ఎం.గణపతిరావు, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, గంట్యాడ జెడ్‌పిటిసి వర్రి నర్సింహమూర్తి, తాహశీల్దార్ రాఘవ, తాటిపూడి ఆయుకట్టుదారుల సంఘం అధ్యక్షులు బోలెం ఎర్రినాయుడు, తాటిపూడి సర్పంచ్ కోడెల ముత్యాలనాయుడు, మదనాపురం సర్పంచ్ జె.అప్పారావు, ఇరిగేషన్, నేషనల్ హైవేస్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

రహదారి పనులకు శంకుస్థాపనచేస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 5వ డివిజన్లో రూ.76 లక్షలతో నిర్మించనున్న రహదారులు, కాలువ పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శ్రీకరం చుట్టారు. సోమవారం నవాబుపేట ప్రాంతంలో 20 లక్షల రూపాయలతో, ద్వారకా నగర్ లో 56 లక్షల రూపాయలతో రహదారులు కాలువ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి పనులు నిరాటంకంగా సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ప్రజాశక్తి-విజయనగరం రూరల్

చిరు ప్రాయంలో అమ్మఒడి నుంచి సైనిక పాఠశాల బడి ఒడిలో చేరి, ఏడేళ్ల శిక్షణ తరువాత మాతృభూమి సేవలో తరించిన శిక్షకులు 50ఏళ్ల తరువాత అదే పాఠశాల ఒడిలో సేద తీరేందుకు తరలివచ్చారు. 1973-81 సంవత్సరంలో కోరుకొండ సైనిక స్కూలులో చదువుకున్న విద్యార్థులంతా సోమవారం పాఠశాలలో కలుసుకున్నారు. 1981లో 64వ నేషనల్ డిఫెన్స్ అకాడమీలో 35 మంది విద్యార్థులు దేశ రక్షణ శాఖలో చేరి దేశ సేవ చేశారు. వీరే కాకుండా విద్య, వైద్యం, శాస్త్ర, సాంకేతిక, వ్యాపారం వంటి రంగాల్లో స్థిర పడ్డారు. వీరంతా కుటుంబ సభ్యులతో సహా దేశ నలుమూలల నుంచి, విదేశాల నుంచి అపూర్వ కలయికకు హాజరయ్యారు. తమ అనుభవాలను, అనుభూతులను పంచుకున్నారు. సైనిక పాఠశాల విద్యార్థులను కాదు.. లీడర్స్‌ను తయారు చేస్తుందని అన్నారు. కొందరు పూర్వ విద్యార్థులు వారు సాధించిన పతకాలను విద్యార్థుల సందర్శనార్థం పాఠశాలకు బహుకరించారు. ప్రస్తుత విద్యార్థుల భోజన శాలను ఆధునీకరించేందుకు రూ.కోటి విరాళం అందజేశారు. వీరికి ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శాస్త్రి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.కేశవన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుష్టుపై నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కుష్టివ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం సరికాదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి భాస్కరరావు అన్నారు. 1993-94 సంవత్సరం నెల్లిమర్ల సికెం జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు కోటేశ్వరరావు, సురేష్, వెంకటపతిరాజు, రాంబాబు, నాగేశ్వరరావు 30 మంది కుష్టు రోగులకు ప్రత్యేకంగా తయారు చేసిన రూ.12వేలు విలువగల చెప్పులను సోమవారం డిఎంఅండ్‌హెచ్ఒ చేతులు మీదుగా అందచేశారు. జిల్లా కో-ఆర్డినేటర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కాంతారావు

హాస్టళ్లలో ఫుడ్‌కమిషన్ సభ్యులు తనిఖీ

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం జిల్లాకు చేరుకున్న రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు జిల్లా కేంద్రంలోని పలు సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేసి విద్యార్థులకు సరఫరా చేస్తున్న ఆహార నాణ్యతపై ఆరా తీశారు. బాలికల వసతి గృహం విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న ఆహారం, మెనూ గురించి తెలుసుకున్నారు. నగరంలోని ఎస్.సి, ఎస్.టి. కళాశాల వసతి గృహాలను ఆయన తనిఖీ చేశారు. అంతకుముందు నగరంలోని పలు హోటళ్లను తనిఖీ చేశారు బొబ్బాది పేట ఎండియు వాహనానికి మెమో జారీ చేశారు. బాలాజీ నగర్ ఎండియు వాహనంలో గోధుమ పిండి 100కేజీలు, 300కేజీలు రైస్ తక్కువ రావడంతో కేసు నమోదు చేసారు. కొత్తపేట రేషన్ డిపో పరిశీలించి డిపో బయట స్టాక్ వివరాలు పెట్టాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరులో భాగంగా సంస్కృత కళాశాల విద్యార్థులతో కలిసి ఆహార నాణ్యతను పరిశీలించారు. విజయనగరం 2 వద్ద గల ఎఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేసి దాన్ని సేకరణ, వాటి బరువు నాణ్యత పరిశీలించారు. కార్మికులతో మాట్లాడి కూలీల జీతాలు, బిల్లు వివరాలు అడిగి తెలుసుకున్నారు

ఉద్యోగం ఇవ్వలేదని ఒకరు... ఉపాధి దెబ్బతీశారని మరొకరు

జగనన్నకు చెబుదాంలో వెతలెన్నో..

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అన్ని అర్హతలూ ఉన్నా తనకు అన్యాయం చేసి, అర్హత లేని వ్యక్తికి ఉద్యోగం కట్టబెట్టారంటూ ఓ నిరుద్యోగ మహిళ... ఉన్న ఉపాధికి దూరం చేసి పొట్టకొట్టారంటూ మరో యువకుడి వ్యధ. ఇలా ఎన్నో వ్యక్తిగత సమస్యలు, మరెన్నో సామాజిక, సామూహిక సమస్యలతో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజానీకం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం'లో ఫిర్యాదు చేశారు. వీటిపై స్పందించిన జిల్లా జాయింట్ కలెక్టర్ తదితర ఉన్నతాధికారులు సంబంధిత జిల్లా అధికారులకు ఫిర్యాదులు, దరఖాస్తులను బదిలీ చేసి, వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. వీటిలో ముఖ్యంగా కటిక పేదరికంతో కుటుంబాన్ని నెట్టుకుంటూ జీవనం వెల్లదీస్తున్న తనకు ఉన్నత విద్యార్హతలు ఉన్నా పక్కనబెట్టి, తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో వచ్చిన ప్రభుత్వ ఉద్యోగి భార్యకు అధికారులు కొలువు ఇచ్చారని గాజులరేగకు చెందిన సిద్ధా శ్రీదేవి అనే మహిళ ఆవేదన వెల్లగక్కింది. ఆమె కథనం ప్రకారం... కస్తూరిబా బాలికల విద్యాలయాల్లో టీచర్ పోస్టులకు ఇటీవల నోటిఫికేషన్ విడుదల అయ్యింది. వీటిలో కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్థికంగా వెనుకబడిన అభ్యర్థులకు (ఇడబ్ల్యుఎస్) 10శాతం పోస్టులు కేటాయించాల్సింది. శ్రీదేవి కొన్నాళ్ల క్రితం వరకు మెప్మాలో హెచ్‌ఆర్‌పిగా పనిచేసేది. 5వేల వేతనంతో కుటుంబాన్ని నెట్టుకు రావడం కష్టతరంగా ఉంది. భర్త ఆటో డ్రైవర్. ఆయన తెచ్చిన డబ్బులతో ఇల్లు నెట్టుకొస్తున్నప్పటికీ పిల్లల చదువులు, ఆలన, పాలన కష్టతరంగా ఉంది. ఈ నేపథ్యంలో ఎంఎ విద్యార్హతగల శ్రీదేవి పిఇటి పోస్టుకు దరఖాస్తు చేసుకుంది. ఆమెతోపాటు బొబ్బిలికి చెందిన మరో మహిళ కూడా ఇంటర్వ్యూకి వెళ్లారు. ఆమె భర్త కేంద్ర ప్రభుత్వ సర్వీసులో ఉన్నారని, పిజి కూడా పూర్తిచేయలేదని, పైగా పిజిలో తనకంటే ఎక్కువ మార్కులు వచ్చినట్టు, ఆర్థికంగా వెనుకబడి ఉన్నట్టు దొంగ సర్టిఫికెట్లు చూపించారని శ్రీదేవి వాదన. తనకు రావాల్సిన పోస్టును, అన్ని విధాల అనర్హతగల వ్యక్తికి ఉద్యోగం ఇచ్చి, తనకు అన్యాయం చేశారంటూ శ్రీదేవి అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేసింది. ఇదే విషయమై డిఇఒ, ఇన్‌ఛార్జి ఎపిసి లింగేశ్వరరెడ్డి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ న్యాయం జరగలేదంటూ ప్రజాశక్తి ఎదుట ఆవేదన వ్యక్తం చేసింది.

పూసపాటిరేగ మండలం వెంపడాం గ్రామానికి చెందిన దుక్క రాంబాబు స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జూనియర్ కుక్‌గా పనిచేసేవాడు. పాఠశాల పున:ప్రారంభం నుంచి పనిలోకి రానివ్వడం లేదు. దీంతో, కుటుంబ పోషణ కష్టంగా మారింది. ఈనేపథ్యంలో 'జగనన్నకు చెబుదాం' అంటూ కలెక్టరేట్‌కు వచ్చిన ఆ యువకుడు అధికారుల ఎదుట కంటతడి పెట్టాడు. ఉన్నట్టుండి ఉపాధి లేకుండా చేస్తే కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలంటూ ప్రజాశక్తి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ఒకకదు, ఇద్దరు కాదు. ఈ వారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి సుమారు 313 వినతులు అందాయి. వీటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 191, గ్రామ, వార్డు సచివాలయాల్లో సమస్యలపై 80 అందగా, గృహ నిర్మాణ లబ్ధిదారులు 14, డిఆర్‌డిఎలో పరిధిలోని సమస్యలపై 13, పంచాయతీ రాజ్ శాఖకు సంబంధిచి 10 ఫిర్యాదులు అందాయి.

తనకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తంచేస్తున్న శ్రీదేవి

14న జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయనగరం

ఈనెల 14న గజపతినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయనున్న జాబ్ మేళా ను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జెసి మయూర్ అశోక్ తెలిపారు. 16 ప్రముఖ కంపెనీలలో సుమారు 1000 పోస్టులను టెన్త్ నుండి పి.జి వరకు క్వాలిఫికేషన్‌తో నెలకు 50 వేల వరకు వేతనాన్ని అందించే ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. bit.Iy/43biyya link ద్వారా రిజిస్టర్ కావాలని , వివరాలకు 99888 53335, 9000102013 నెంబర్లకు కాంటాక్ట్ చేయాలని తెలిపారు.

యువగళంకు మద్దతుగా కాగడాల ప్రదర్శన

విజయనగరం కోట : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్ర 2వేల కిలో మీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం సాయంత్రం కోట జంక్షన్ వద్ద తెలుగు యువత ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు యువగళం యువతకు బలం, జై లోకేష్ అంటూ నినాదాలు చేశారు.

వరినారుకు జీవం పోసిన వర్షం

ప్రజాశక్తి-బొబ్బిలి

ఉమ్మడి జిల్లాలో సోమవారం సాయంత్రం పలుచోట్ల భారీ వర్షం కురిసింది. వర్షంతో వరినారు జీవం పోసుకుంది. బొబ్బిలి, మెంటాడ, వేపాడ, సీతంపేట, వీరఘట్టాం, పాలకొండలో వర్షాలు కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. వారం రోజులు క్రితం కురిసిన వర్షానికి రైతులు వరినారు పోశారు. తర్వాత వర్షాలు లేకపోవడంతో వరినారు ఎండిపోయే స్థితికి చేరింది. భారీ వర్షం కురవడంతో వరినారుకు జీవం పోసినట్లు అయిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వర్షంతో పంట పొలాల్లో నీరు చేరింది.

ధర్నాచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు, సిఐటియు నాయకులు

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పలు ప్రజాసంఘాల ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద సోమవారం పెద్దఎత్తున ధర్నాలు చేపట్టారు. గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించాలని సిఐటియుజిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు, గ్రీన్ అంబాసిడర్ల సంఘం జిల్లా కార్యదర్శి మద్దిల రమణ డిమాండ్ చేశారు. రామభద్రపురం మండలం ఆరికతోటలో గ్రీన్ అంబాసీడర్‌గా పనిచేస్తున్న మామిడి గౌరి చనిపోవడానికి ప్రభుత్వమే కారణమని, కావున ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. గ్రీన్ అంబాసిడర్లకు సకాలంలో జీతాలు రాకపోవడం వలన ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని అన్నారు. అందులో భాగంగానే ఆరికతోట గ్రామానికి చెందిన మామిడిగౌరి (55) ఆర్థిక ఇబ్బందులతోను రాజకీయ వేధింపులతోను పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకొని చనిపోయాడని తెలిపారు. ఇదే పద్ధతిలో రాష్ట్రప్రభుత్వం వ్యవహరిస్తే చాలా మంది ఇదే మాదిరిగా ఆత్మస్థైర్యం కోల్పోతారని తెలిపారు. చనిపోయిన గ్రీన్‌అంబాసిడర్ మామిడి గౌరీకి 10లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించి అతని భార్యకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. డెంకాడ మండలం వెదుళ్లవలస పంచాయితీలో క్లాప్‌మిత్రగా పనిచేస్తున్న ఎద్దు సూరిబాబుపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని, పి.ఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, కార్మికులకు భద్రత పరికరాలు అందజేయాలని డిమాండ్ చేశారు. అక్రమంగా తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అక్రమ వాటర్ ప్లాంట్లను సీజ్ చేయాలి

విజయనగరంలో అనుమతులు లేకుండా అక్రమంగా నడుపుతున్న వాటర్ ప్లాంట్‌లను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం కార్యదర్శి రెడ్డి శంకర్రావు మాట్లాడుతూ అయ్యప్పనగర్‌లో అక్రమంగా వాటర్ ప్లాంట్ నడుపుతున్న స్వాతీ ప్యూర్ ఫైడ్ వాటర్ ప్లాంట్ యాజమాని పూసర్ల మధుని అరెస్ట్ చేసి గెడ్డ సర్వేచేసి ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయం కోసం పోరాడుతున్న అయ్యప్ప నగర్ నాయకులపై పెట్టిన ఎస్‌సి అట్రాసిటీ తప్పుడు కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు, అనంతరం కలెక్టర్, ఎస్‌పి, ఆర్‌డిఒలకు వినతులు అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఆర్.శ్రీను, కె.త్రినాథ్, డి.సన్నీబాబు, అయ్యప్ప నగర్ నాయకులు సుదర్శన్, సంతోష్, ప్రసాధ్, ఐద్వా జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ, సహాయ కార్యదర్శి వి. లక్ష్మి, సిఐటియు నగర కార్యదర్శి.బి.రమణ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు హరీష్ తది తరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న నగర వాసులు, పిపిఎస్ఎస్ నాయకులు

మినీ గోకులాల బిల్లులు చెల్లించాలని...

మినీ గోకులాలు బిల్లులు చెల్లించాలని ఎపి రైతు సంఘం నాయకులు చల్లా జగన్ డిమాండ్ చేశారు. సోమవారం సంఘం అధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతులు పశువర్ధకశాఖ అధికారులు సూచనలు మేరకు మినీగోకులం షెడ్లు నిర్మించుకొంటే 6పశువుల షెడ్ కు రూ.లక్షా 80వేలు, నాలుగు పశువుల షెడ్డుకు రూ.1.40లక్షలు ఇస్తామని చెప్పారని అన్నారు. కొంత మేర బిల్లులు చెల్లించి అధికారులు ఊరుకున్నారని, వెంటనే పేదరైతులకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి అందజేశారు. కార్యక్రమంలో మిడతాన పరదేశినాయుడు రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు భాగస్వామ్యం కావాలి

రామభద్రపురం: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని రోటరీక్లబ్ అధ్యక్షులు జెసి రాజు పిలుపునిచ్చారు. సోమవారం పాఠశాలలో బొబ్బిలి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణంలో సమతుల్యం లోపించటం వల్ల భూమి వేడెక్కి భూతాపం పెరుగుతుందన్నారు. భూ తాప నియంత్రణకు విరివిగా మొక్కలను నాటాలన్నారు. ప్రతి విద్యార్థి వారి జన్మదినం నాడు ఒక మొక్కను నాటి దాన్ని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు. ఎవరికైనా బహుమతులుగా మొక్కలను అందివ్వాలని సూచించారు. విద్యుత్, పేపర్ వాడకాన్ని తగ్గించుకోవాలని తద్వారా వృక్ష సంపదను కాపాడుకోవచ్చని అన్నారు. అంతర్జాతీయ రోటరీ పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యత నిస్తుందని అవగాహనా కోసం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, కృష్ణం నాయుడు, రాజ శేఖర్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ గోల్డెన్ బ్రష్ అవార్డు స్వీకరణ

నెల్లిమర్ల: విజయవాడ బాలోత్సవ భవనంలో జరిగిన చిత్రకళా పోటీల్లో విజేతల అవార్డుల ప్రదానోత్సవంలో ప్రముఖ చేతుల మీదుగా జరజాపుపేటకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, చిత్రకారుడు, కవి, రచయిత డాక్టర్. కడలి ప్రకాశరావు సోమవారం ఎన్టీఆర్ చిత్రకళా గోల్డెన్ బ్రష్ అవార్డు స్వీకరించారు. ప్రశంసాపత్రం, మెమెంటోలతో ప్రముఖులు మన్ననలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంజి ఆర్ట్స్ అధ్యక్షులు అంజి, ప్రముఖ చిత్రకారుడు దాసోజు శివప్రసాద్, జేఎన్‌టియు ఫైన్ ఆర్ట్స్ అధినేత రిజిస్ట్రార్ సుందర్ కుమార్, నంది పురస్కార గ్రహీత, రంగస్థల నటులు కృష్ణ, 64 కళల సారథి కళా సాగర్ తదితర ప్రముఖులు ప్రకాశరావును సత్కరించారు.

మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత

బొబ్బిలి: మల్లమ్మపేటలో మౌలిక సౌకర్యాలు కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అన్నారు. మల్లమ్మపేటలో సోమవారం పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 25వ వార్డులో కాలువలు, రోడ్లు నిర్మించాలని కౌన్సిలర్ కె.లక్ష్మి, టిడిపి నాయకులు కె. సత్యనారాయణ కోరగా గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో రోడ్లు, కాలువలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. గడిచిన రెండేళ్లలో 31వార్డులలో రూ.3కోట్లతో అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. అన్ని వార్డుల్లో రోడ్లు, కాలువలు నిర్మిస్తామన్నారు. ఆయనతో కౌన్సిలర్లు తెంటు పార్వతమ్మ, కె. రామారావు, నాయకులు తెంటు శివప్రసాదనాయుడు, పి.చినవెంకటరమణ, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

బొబ్బిలి: ఓట్లు నమోదుకు రాజకీయ పార్టీలు సంపూర్ణంగా సహకరించాలని ఆర్‌డిఒ పి.శేషశైలజ కోరారు. తన కార్యాలయంలో ఓట్లు నమోదుపై రాజకీయ పార్టీలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. పారదర్శకంగా ఓటర్ల జాబితా తయారు చేస్తామన్నారు. పది లోపు దరఖాస్తులు సమీప బిఎల్‌ఒలకు అందించాలని కోరారు. వాలంటీర్లు ఓట్లు నమోదులో జోక్యం చేసుకోకూడదన్నారు. అవగాహన ర్యాలీలు, సదస్సులు, రన్నింగ్, వాకింగ్ పోటీలు నిర్వహణకు సహకరించాలని కోరారు. సమావేశంలో తహశీల్దార్ డోల రాజేశ్వరరావు, వైసిపి, టిడిపి, కాంగ్రెస్, సిపిఎం, లోక్‌సత్తా, బిఎస్‌పి పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అంతర పంటగా చిరుధాన్యాలు

కొత్తవలస: వ్యవసాయ ఉత్పత్తిలో అంతర పంటగా చిరుధాన్యాలు చేయడం వల్ల అధిక ఉత్పత్తి సాధించవచ్చని ఆర్‌బికె 'హేమ సుందర్' అన్నారు. సోమవారం చినరావు క్లస్టర్, గొల్లలపాలెం, చిడివలస గ్రామంలో చేసిన అంతర పంటలో చిరుధాన్యాలు వేసే విధానాన్ని ఆయన పరిశీలించారు. కొర్రలు, గంటి పంటలో అంతరపంటలుగా గోంగూర, తోటకూర, బొబ్బర్లు, బరబాటి, మినుములు, జొన్నలు వెయ్యడాన్ని పరిశీలించారు. దీని వల్ల ప్రధాన పంటకు తెగుళ్లు, పురుగులు సోకకున్న చేస్తుందన్నారు. రైతులకు అంతర పంటలు వల్ల కొంత ఆదాయం రావడం జరుగుతుందన్నారు. బహుళ పంటలు వెయ్యడం వల్ల భూసారం పెరగడంతో పాటు జీవ రాశుల్లో జీవవైవిధ్యాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. రైతులందరూ బహుళ పంటలు సాగు చెయ్యాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపి సీడ్స్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కోలాట బృందానికి మైక్ సెట్లను అందిస్తున్న సత్యనారాయణ దంపతులు

ఘనంగా 'సింగపూర్' పుట్టినరోజు వేడుకలు

లక్కవరపుకోట: వైసిపి మండల అధ్యక్షులు గుమ్మడి సత్యనారాయణ (సింగపూర్) పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని తలారి పంచాయతీ శివారులో ఉన్న సింగపూర్ రిసార్ట్స్‌లో జరిగిన పుట్టినరోజు వేడుకలలో తలారి, దాసుళ్లపాలెం పంచాయతీలలో ఉన్న కోలాటం గ్రూపులకు వైర్లెస్ మైక్ సెట్‌లు ఉచితంగా పంపిణీ చేశారు. మండలానికి చెందిన ఓ దినపత్రిక విలేఖరి భార్య అనారోగ్యానికి గురవడంతో ఆమెకు రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు తూర్పాటి వెంకటరామకృష్ణ, మళ్లీవీడు సర్పంచ్ ఆదిరెడ్డి అర్జున్, కొత్తవలస ఎఎంసి డైరెక్టర్ కొట్యాడ శ్రీనివాసరావు, మండల కో ఆప్షన్ నెంబర్ షేక్ ఖాసిం, తూర్పాటి అప్పలరాజు, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

ఫెయిలైన డైట్ విద్యార్థులకు అవకాశం

నెల్లిమర్ల: 2015 నుంచి 2020 వరకు డైట్ పరీక్షలు ప్రథమ, చివరి సంవత్సరం లెసన్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో ఫెయిలైన, హాజరకాలేకపోయిన విద్యార్థులకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ ఎన్. తిరుపతి నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అటువంటి వారికి ఈ నెల 12 నుంచి 15 వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆయా (డైట్) విద్యార్థులు వారికి సంబంధించిన కళాశాల ప్రిన్సిపాల్‌ని సంప్రదించాలని సూచించారు. 2021-23 బ్యాచ్, రెగ్యులర్ విద్యార్ధులు సెకండ్ సెమిస్టర్, ఫైనల్ లెసన్ ప్రాక్టికల్స్ పరీక్షలు ఈ నెల 12 నుంచి 15వరకు జరుగుతాయని తెలిపారు.

రామాలయం నిర్మాణానికి రూ. 30వేలు విరాళం

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని దళిత వీధిలో నిర్మాణం చేపడుతున్న శ్రీ కోదండ రామాలయానికి నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ కర్రోతు బంగారు రాజు రూ. 30వేలు విరాళం అందించారు. దళిత కాలనీలో నిర్మాణం అవుతున్న రామాలయాన్ని ఆయన సోమవారం సందర్శించారు. దేవాలయం ఎప్పుడు నిర్మించారు ఎవరు నిర్మించారు అని అక్కడ పెద్దలను అడిగి తెలుసుకున్నారు. దేవాలయాలు నిర్మాణంలో తన వంతు సహకారం అందించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పిన్నింటి సన్యాసినాయుడు, ఎంపిటిసి పిన్నింటి లక్ష్మీనాయుడు, నాయకులు పిన్నింటి కిషోర్, మురపాల బోగేశ్, పిడిఎ ప్రసాద్, పట్నాన శ్రీనివాసరావు, పిన్నింటి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా

బొబ్బిలి: ఇందిరమ్మ కాలనీలో అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. ఇందిరమ్మ కాలనీలో విద్యుత్ వైర్లు కింద స్థలాలను అక్రమించేసి నిర్మాణాలు చేపట్టడంతో మున్సిపల్ అధికారులు సోమవారం జేసిబితో తొలగించారు. విద్యుత్ వైర్లు కింద నిర్మాణాలు చేస్తే ప్రమాదాలు జరిగే ప్రమాదం అవకాశాలు ఉండడంతో ఎవరికి పట్టాలు ఇవ్వకుండా ఖాళీగా ఉంచారు. ఖాళీ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేయడంతో అధికారులు కూల్చివేశారు. ఇందిరమ్మ కాలనీలో ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారి మరమ్మతు పనులు

వేపాడ: మండలంలోని ప్రధాన రహదారి వల్లంపూడి నుండి వేపాడ గుల్లిపెల్లి వారి ఇంటి మలుపు వరకు ఉన్న రహదారి మరమ్మతు పనులను సోమవారం చేపట్టారు. ఈ రోడ్డు గురించి 'రహ దారుణం' అనే కథనం ఇటీవల ప్రజాశక్తిలో వెలువడింది. దీనికి స్పందించిన అధికారులు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మండంలోకి పర్యటనకు వస్తున్న నేపథ్యంలో రోడ్డును తాత్కాలికంగా పూడ్చారు. శాశ్వతంగా రోడ్డును బాగుచేయాలని కోరుతున్నారు.

13న ఉచిత మెగా వైద్య శిబిరం

నెల్లిమర్ల: స్థానిక ఆదిత్య పాఠశాలలో ఈనెల 13న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మెడికవర్ ఆసుపత్రి పిఆర్ఒ మురళీ సోమవారం ప్రకటనలో తెలిపారు. విజయనగరం తిరుమల మెడికవర్ హాస్పిటల్ డాక్టర్ తిరుమల ప్రసాద్, ఆయన సతీమణి విజయనగరం రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ కృష్ణ శాంతి ఆధ్వర్యంలో ఈ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భవన నిర్మాణాల్లో జాప్యానికి వీల్లేదు

- నిర్మాణం చేపట్టిన భవనాలన్నీ పూర్తి కావాల్సిందే
- పనులకు బిల్లులు చెల్లించే బాధ్యత మాది
- ఇబ్బందులొస్తే మాతో చెప్పండి : మంత్రి బొత్స

ప్రజాశక్తి- వేపాడ, గుర్ల

గ్రామాల్లో చేపట్టిన సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాలను వచ్చే రెండు నెలల్లోగా పూర్తిచేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. వేపాడ మండలంలోని వల్లంపూడి, గుర్ల మండలంలోని పకీరుకిట్టలి సచివాలయ భవనాలను ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం వేపాడ మండల పరిషత్ కార్యాలయంలో ఎస్.కోట నియోజకవర్గ పరిధిలో నిర్మాణం జరుగుతున్న భవనాల పనులపై గ్రామాల వారీగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్షించారు. ఈ భవనాల నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత గల అంశంగా భావిస్తోందని, దీనిని గుర్తించి తుది దశల్లో నిర్మాణంలో వున్న భవనాలను వెంటనే పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. భవన నిర్మాణంలో సమస్యలేమైనా ఎదురైతే వాటిని తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించే ప్రయత్నం చేస్తామన్నారు. పనులకు బిల్లుల చెల్లింపు బాధ్యత తమదని చెప్పారు. భవనాలకు అవసరమైన సిమెంట్ సరఫరా కోసం రాష్ట్ర స్థాయి అధికారులతో మాట్లాడి సరఫరా అయ్యేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. నిర్మాణం పూర్తయిన భవనాలను తగిన సమయం కేటాయించి ప్రారంభించడం ద్వారా వాటిని వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావును కోరారు. శ్లాబ్ స్థాయిలో వున్న భవనాలను నెలాఖరు నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

మండలంలోని ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు తదితర ప్రజాప్రతినిధులు కూడా ఈ భవనాల నిర్మాణంపై నిరంతరం పర్యవేక్షణ చేస్తూ త్వరగా పూర్తిచేసేందుకు సహకరించాలన్నారు. జామి మండలంలో నిర్మాణం పూర్తయిన 22 గ్రామ సచివాలయ భవనాలను నెలరోజుల్లో ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కోరారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఇ. రమేష్ గుప్తా నియోజకవర్గంలో భవన నిర్మాణాల పరిస్థితిపై మంత్రికి వివరించారు. 104 గ్రామ సచివాలయ భవనాలకు గాను 67 పూర్తయినట్టు తెలిపారు. 97 రైతు భరోసా కేంద్రాలకు గాను 45 పూర్తయ్యాయని, మరో 20 వివిధ దశల్లో వున్నాయని వివరించారు. 85 హెల్త్ క్లినిక్ భవనాలు మంజూరుకాగా 30 పూర్తయ్యాయని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు బాణాది, వావిలపాడు సచివాలయాలను ప్రారంభించారు. సమావేశంలో ఎంపి ఎంవివి సత్యనారాయణ, జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి, గ్రామ, వార్డు సచివాలయాల అధికారి నిర్మలాదేవి, ఎంపిడిఒ బిఎస్ఎన్ పట్నాయక్, మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, డిసిసిబి ఛైర్మన్ వి.చినరామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ఆసరా నిధులు వెంటనే జమకావాలి

రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ ఆసరా కింద మహిళా సంఘాల సభ్యులకు విడుదల చేసిన నిధులు రెండు రోజుల్లోగా వారి ఖాతాల్లో జమ కావాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశించారు. జిల్లాలో కొన్ని సంఘాల సభ్యులకు నేటికీ నిధులు జమకాకపోవడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికీ నిధులు జమకాని సంఘాలను గుర్తించి వాటికి నిధులు జమచేసే దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి సూచించారు. వల్లంపూడిలో ఏర్పాటు చేసిన సభలో వివిధ ప్రభుత్వ సంస్థలు, ఉద్యోగుల పనితీరుపై మంత్రి సమీక్షించారు. మహిళా సంఘాల పనితీరుపై సమీక్ష సందర్భంగా ఆసరా నిధుల విడుదలపై మంత్రి ఆరా తీశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు తమకు ఆసరా డబ్బులు ఇంకా అందలేదని చెప్పడంతో డిఆర్‌డిఎ సిబ్బందిని మంత్రి ప్రశ్నించారు. దీనిపై ఎపిఎం మండలంలో 274 మహిళా సంఘాలకు ఇంకా ఆసరా నిధులు జమ కాలేదని తెలిపారు. ఆయా సంఘాల తీర్మానాలను బ్యాంకులకు పంపించామని వారం రోజుల్లో జమ అయ్యే అవకాశం వుందని వివరించారు. గ్రామంలో మహిళాశిశుసంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్యశాఖల ద్వారా గర్భిణులకు అందుతున్న సేవలపై మంత్రి ఆరా తీశారు. గ్రామంలో ఫించన్ల పంపిణీపైనా మంత్రి సమీక్షించారు. పంపిణీ కోసం ఎవరైనా వాలంటీర్లకు డబ్బులు ఇస్తున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనకు ముఖ్యమంత్రి జగన్ నాలుగేళ్ల పాలనలో ప్రజలకు అందించిన కార్యక్రమాలను పోల్చి చూసుకోవాలన్నారు. జగనన్న సురక్షలో భాగంగా పలువురి ఫించన్ల మంజూరు సమస్యల పరిష్కారం కోసం చేసిన విజ్ఞప్తులపై మంత్రి బొత్స మండల అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

వాలంటీర్లకు పవన్ క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి - కొత్తవలస

గ్రామ వాలంటీర్లను కించపరిచే విధంగా పవన్ కళ్యాణ్ మాట్లాడడం సిగ్గుచేటని, తక్షణం గ్రామ వాలంటీర్లకు క్షమాపణ చెప్పాలని వాలంటీర్లు డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్‌కి వ్యతిరేకంగా ఎంపిడిఒ కార్యాలయం నుండి కొత్తవలస అంబేద్కర్ జంక్షన్ వరకు సోమవారం ర్యాలీ చేపట్టారు. అనంతరం అంబేద్కర్ జంక్షన్‌లో రాస్తారోకో చేశారు. మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతి, కొప్పులవెలమ కార్పొరేషన్ ఛైర్మన్ నెక్కల నాయుడు బాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన వాలంటీర్ వ్యవస్థను కించపరిచే విధంగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు గోరపల్లి శివ, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, మేలాస్త్రీ అప్పారావు, బొంతల వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

గరివిడి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వాలంటీర్ల వ్యవస్థను కించపరుస్తూ పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలకు చీపురుపల్లి పట్టణంలో వాలంటీర్లు చేపట్టిన నిరసన కార్యక్రమానికి వైసిపి మండల అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, యువ నాయకులు బెల్లాన వంశీకృష్ణ మద్దతు పలికారు. అనంతరం చీపురుపల్లి మూడురోడ్ల జంక్షన్లో వాలంటీర్లు అంత కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు పతివాడ రాజారావు, ఎంపిటిసిలు కోరుకొండ దాలయ్య, కోసిరెడ్డి రమణ, గెరిడీ రామదాసు, ముళ్ళ పైడిరాజు వాలంటీర్లు పాల్గొన్నారు.

జామి : ఇటీవల జనసేన అధినేత పవన్ కళ్యాణ వాలంటీర్లు ఉద్దేశించి మాట్లాడినా మాటలపై మండలంలోని వాలంటీర్లు ప్లకార్డులతో నిరసన తెలిపారు. జామి బస్ స్టాండులో రాస్తా రోకో నిర్వహించి, పవన్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి జి.సరయు, జన్నివలస సర్పంచ్ చందు, కుమారాం వైసిపి నాయకులు రవి, వాలంటీర్లు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన : గొంప

ప్రజాశక్తి- శృంగవరపుకోట

రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అరాచక పాలన సాగిస్తున్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ విమర్శించారు. సోమవారం మండలంలోని ధర్మవరం, కొట్టాం గ్రామాల్లో టిడిపి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజల వద్దకు వెళ్లి మహానాడులో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టో మహిళలకు యువతకు రైతులకు వివరించారు. అనంతరం గ్రామంలోని రామాలయంలో యువత మహిళలతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి పాలనలో ప్రజలు విసిగిపోయారని పెరిగిన ధరలు చూసి మహిళలు భయపడుతున్నారన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ రాక యువత నిర్వేదంలో ఉన్నారని ఇవన్నీ ఈ పార్టీని వచ్చే ఎన్నికల్లో బంగాళాఖాతంలో తమ ఓటు హక్కుతో ప్రజలు కలిపేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం, గోపాలపల్లి, వినాయక పల్లి సర్పంచులు గాలి సన్యాసయ్య, ఆడారి ఉమామహేశ్వరరావు, గనివాడ సన్యాసినాయుడు, నాయకులు రాయవరపు, చంద్రశేఖర్, జుత్తాడ రామసత్యం, మంగరాజు, మండా త్రినాథ్, ఆడారి రమేష్ పాల్గొన్నారు.

భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న గొంప కృష్ణ

రాయల్టీ రగడ

- కలెక్టర్ వాహనానికి ట్రాఫిక్ అంతరాయం
- వివాదాస్పదంగా మారిన ప్రైవేటు చెక్ పోస్ట్
- సిబ్బందితో గొడవకు దిగిన హైవే ప్రతినిధులు

ప్రజాశక్తి - జామి

మైనింగ్ రాయల్టీ ప్రైవేటు పరం చేస్తూ, ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయంపై గందరగోళం నెలకొంది. కొత్తగా ఏర్పాటు చేసిన రాయల్టీ చెక్ పోస్టులు వద్ద తరుచూ గొడవలు జరుగుతున్నాయి. గత కొద్ది రోజులుగా గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ సంస్థ ప్రతినిధులు, చెక్ పోస్ట్ సిబ్బందికి మధ్య వివాదం నడుస్తోంది. రాయల్టీ బిల్లు లేకుండా వాహనాలను వదిలేది లేదని చెక్ పోస్ట్ సిబ్బంది చెబుతుంటే, హైవే నిర్మాణ దారులు మాత్రం వాహనాలు విడిచి పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై సోమవారం వివాదం పెరిగింది. దీంతో రహదారి మధ్యలో వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామ్ అయింది. ఈ సమయంలో జిల్లా కలెక్టర్ వాహనం అటువైపు గుండా వెళ్లడంతో కొంత సేపు ఆగాల్సి వచ్చింది. ఇంకొంత సేపటికి మంత్రి బొత్స కాన్వాయ్ కూడా అటు వచ్చినప్పటికీ వాహనాలు రద్దీ తగ్గిపోవడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.

మండల కేంద్రంలో రాయల్టీ ప్రైవేటు చెక్ పోస్ట్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నెల ఒకటి నుంచి మైనింగ్ రాయల్టీలు ప్రయివేటు సంస్థలకు అప్పగించిన నేపథ్యంలోనే జిల్లా అంతటా చెక్ పోస్టులు వెలిశాయి. ప్రధానంగా క్వారీలు నుంచి మెటీరియల్ బయటకు తరలించే ప్రధాన కూడలి వద్ద చెక్ పోస్టులు పెట్టి ఆయా సంస్థ ప్రతినిధులు బిల్లులు తనిఖీ చేస్తుంది. బిల్లులు లేని వాహనాలను నిలిపివేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే హైవే నిర్మాణ పనులకు ఆటంకం కలుగుతుందని హైవే ప్రతినిధులు చెక్ పోస్టు సిబ్బందితో గొడవకు దిగుతున్నారు. పనులు నిలిచిపోతున్నాయని, దాని వల్ల హైవే నిర్మాణం ఆలస్యం అవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులున్న క్వారీలకే రాయల్టీ బిల్లులు

జిల్లా వ్యాప్తంగా 200లకు పైగా క్వారీలకు ప్రభుత్వం లీజులు మంజూరు చేసింది. వీటిలో అత్యధిక క్వారీలు రెన్యువల్ పూర్తి కాలేదు. దీంతో ప్రభుత్వం ఆయా క్వారీలు రాయల్టీ బిల్లులు మంజూరు చేయలేదు. దీంతో అనుమతులు ఉన్న క్వారీల నుంచే మెటీరియల్ తరలించాలి. కానీ ఒక్కసారిగా రాయల్టీ చెక్ పోస్టులు పెట్టి, మరీ వాహనాలు తనిఖీ చేయడంతో మైనంగ్ వ్యాపారంపై ఆధారపడ్డ వాహనదారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ట్రాక్టర్ యూనిట్‌కి (3 క్యూబిక్ మీటర్లు)కు రూ. 800 వరకు రాయల్టీ బిల్లు తప్పనిసరి కావడం ఇటు వాహదారులుతో పాటు వినియోగదారుడు పై భారీగా భారం పడడం ఒకెత్తు అయితే, అసలు రాయల్టీ ఇచ్చే క్వారీలు లేకపోవడం సమస్య జటిలంగా మారుతోంది. ఈ నేపథ్యంలో గత కొద్ది రోజులుగా రాయల్టీ చెక్ పోస్టుల వద్ద రగడ నెలకొంది.

సమయపాలన పాటించని ఉద్యోగులు

ప్రజాశక్తి- మెరకముడిదాం

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించడంలేదని, కార్యాలయాల్లో అందుబాటులో ఉండటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. సచివాలయానికి ఎప్పుడు వస్తున్నారో? ఎప్పుడు వెళుతున్నారో తెలియని పరిస్థితిలో ప్రజలు కొట్టిమిట్టాడుతు న్నారు. ఒకవేళ సచివాలయంలో అందుబాటులో ఉన్నప్పటికీ ప్రజలకు అవసరమైన సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నట్లు ఆరోపణులు వినిపిస్తున్నాయి. కొంత మంది సిబ్బందికి ప్రభుత్వ పథకాలు గురించి సక్రమంగా తెలికపోవడంతో ప్రజలకు చెప్పలేకపోతున్నారన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. కార్యాలయానికి సకాలంలో రావడంలేదని ఎవరైనా ప్రశ్నిస్తే మండల కార్యాలయానికి వెళ్లామనో, జిల్లా కేంద్రానికి వెళ్లామనో చెప్పి దాటవేస్తున్నారు. సోమవారం మండలంలోని సోమలింగాపురం సచివాలయంలో మధ్యాహన్నం 12.30 గంటలకు కూడా సిబ్బంది రాకపోవడంతో కార్యాలయం ఖాళీగా దర్శనిమిచ్చింది. ఒక్క విలేజ్ అగ్రికల్చర్ కు సంబంధించిన ఉద్యోగి కూర్మారావు మాత్రమే వున్నారు.

మధ్యాహ్నం 12.30గంటలకు కూడా ఖాళీగా ఉన్న సచివాలయం

రైతులంతా పాడి ఉత్పత్తిని పెంచాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పాడి రైతులందరూ పశుగ్రాసాలు విరివిగా పెంచి పాడి ఉత్పత్తిని పెంచాలని విజయనగరం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వై.వి రమణ అన్నారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్‌లో భాగంగా, పశుగ్రాస వారోత్సవాల సందర్భంగా పోతనపల్లి గ్రామంలో సోమవారం పశు గ్రాసాల పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ తరపున 75శాతం రాయితీతో పశుగ్రాస విత్తనాలు రైతులకు అందుబాటులో రైతు భరోసా కేంద్రాల్లో ఉంచామన్నారు. 60 శాతం సబ్సిడీతో టిఎంఆర్ అందిస్తున్నామని 50 శాతం సబ్సిడీతో చాప్ కట్టర్స్ అందిస్తున్నట్టుగా ఆయన తెలిపారు. అనంతరం విజయనగరం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కన్నంనాయుడు మాట్లాడుతూ వివిధ పశుగ్రాశాలసాగు, వాటి తాలూకా ఉపయోగాలు గురించి తెలియజేశారు. ఎస్‌కోట పశువుల ఆసుపత్రి ఏడి డాక్టర్ బి చలపతిరావు మాట్లాడుతూ బహు వార్షిక పశుగ్రాసాలు, వార్షిక పశుగ్రాసాలు గురించి తెలియజేస్తూ పండించు విధానం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకట్రావు, మండల పశువైద్యాధికారి డాక్టర్ హేమ, పశు వైద్య సహాయకులు, పాడి రైతులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి

ప్రజాశక్తి- బొండపల్లి

చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేయడం ద్వారానే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం అని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం శివ రామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని ముద్దూరు గ్రామానికి సంబంధించిన ఉపాధి హామీ వేతన దారులకు ఆయన మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కుంటు పడిందని మరలా ఈ రెండు రంగాలు పూర్వ వైభవం పొందాలంటే తిరిగి చంద్రబాబునే ముఖ్యమంత్రి చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. యువత, అన్నదాతలకు రాబోవు టిడిపి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం భవిష్యత్తుకు గ్యారంటీ పథకాల కర పత్రాలను వేతన దారులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఒంపల్లి మాజీ సర్పంచ్ ఇల్లాపు కృష్ణ, పైల శ్రీనువాసరావు, తాళ్ళపూడి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

52 మంది గర్భిణులకు తనిఖీలు

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని వియ్యంపేట పిహెచ్‌సిలో సోమవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 52 మంది గర్భిణులను తనిఖీ చేసినట్లు హెచ్.వి. పద్మావతి తెలిపారు. ఇందులో 12 మంది హై రిస్క్ గర్భిణులను గుర్తించినట్లు తెలిపారు. గర్భిణులకు బీపీ, షుగర్, హెచ్.బి, హెచ్.ఐ.వి, బరువులు, ఎత్తులు చూసి ఐరన్ మాత్రలు, కాల్షియం మాత్రలు, బి.కాంప్లెక్స్ మాత్రలు ఇచ్చినట్లు తెలిపారు. ప్రతీ గర్భిణీ డెలివరీ అయ్యే వరకు 100 గ్లాసులు పాలు, 100 గుడ్లు, 100 బెల్లంతో చేసిన పప్పు చీక్కెలతో పాటు 100 కాల్షియం మాత్రలు, 180 ఐరన్ మాత్రలు 100 బి కాంప్లెక్స్ మాత్రలు వేసుకోవాలని ఆమె తెలిపారు. మాతా, శిశు మరణాలు జరగకుండా చూడాలని వైద్యాధికారి గోపాలకృష్ణ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు జరపాలని తెలిపారు. హెచ్.బి. తక్కువ ఉన్నవారికి ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్స్ ఎక్కించినట్లు తెలిపారు. హెల్త్ అసిస్టెంట్ సత్యారావు ఆరోగ్య విద్య అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్.పి.హెచ్.ఈ.ఒ నరసింహారావు, ఎల్టీ సంతోష్, పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పంచాయతీలో అభివృద్ధి పనులకు సహకరించి సమస్యల పరిష్కారానికి కలిసి పని చేద్దామని సర్పంచ్ సంతోషికుమారి వార్డు సభ్యులను కోరారు. సోమవారం స్థానిక పంచాయితీ కార్యాలయంలో ఇంచార్జ్ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్ నేతృత్వంలో ఆమె అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యుడు చెల్లయ్య మాట్లాడుతూ స్థానిక ఎస్సీ కాలనీలో వీధి కొళాయిలు చాలటం లేదన్నారు. వీధిలైట్లు కూడా సక్రమంగా వెలగడం లేదని సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. పట్టణంలో జరుగుతున్న రోడ్ల నిర్మాణాలపై వార్డు సభ్యులకు సమాచారం లేదని పలువురు వార్డు సభ్యులు సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సర్పంచ్ మాట్లాడుతూ గతంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో నిర్ణయించిన పనులు మాత్రమే జరుగుతున్నాయని ఇకమీదట జరిగే పనులు వార్డు సభ్యులకు తెలియజేస్తామని ఆమె తెలిపారు. అనంతరం ఇంటి పన్ను డిమాండ్ కలెక్షన్, 15వ ఆర్థిక సంఘం నిధులు, గాంధీపార్క్ సుందరీకరణ, ప్లాన్' అప్రూవల్స్ వంటి అంశాలను ఆమోదించారు. అనంతరం మొండి వీధిలో నుయ్యి మరమ్మత్తులు, సి.సి.రోడ్లు నిర్మాణం, కళింగెడ్డలో పూడికల తీత వంటి పనులు ప్రతిపాదించారు. వాటికి ఎస్టిమేట్లు వేసి 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించాలని సమావేశంలో నిర్ణయించారు. ఉపసర్పంచ్ మోపాడ కుమార్, గనివాడ శ్రీను, సి.హెచ్.శేషగిరి, ఎం.క్రిష్ణవేణి, సీదరి బార్నో, కొటాన ఈశ్వరి, మజ్జి శేఖర్, సి.హెచ్. నిర్మల తదితరులు హాజరయ్యారు.

సెంచూరియన్ అభివృద్ధికి పాటుపడండి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయం అభివృద్ధికి అధ్యాపకులు తోడ్పడాలని ఛాన్సెలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు పిలుపునిచ్చారు. సోమవారం నూతన వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ పి.కె. మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, పూర్వ రిజిస్ట్రార్ డీన్ ప్రొఫెసర్ పి.ఎస్.వి. రమణారావులకు ఛాన్సెలర్‌తో పాటు అధ్యాపకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఛాన్సెలర్ రాజు మాట్లాడుతూ నాక్ సందర్శన ఉన్నందున అధ్యాపకులు పరిశోధన పత్రాలు తయారు చేయడంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమను సంప్రదించాలన్నారు. నూతన వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ పి.కె. మహంతి మాట్లాడుతూ అధ్యాపకులు తమకు సన్మానం చేయడం కాదని, తామే సన్మానం చేసే స్థాయికి వారు చేరుకోవాలన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ అందరు కలసి విశ్వ విద్యాలయాన్ని ముందుకు తీసుకెళ్ళాలన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ కెవిజి కృష్ణ మూర్తి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చాన్సనల్ జిఎస్ఎన్ రాజు

భూసమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి- బొబ్బిలి

భూసమస్యలను పరిష్కరించాలని స్పందనలో రైతులు ఫిర్యాదులు చేశారు. ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో ఆర్‌డిఒ పి. శేషశైలజ సమస్యలపై వినతులు స్వీకరించారు. తమ తండ్రి సంపాదించిన భూములను పినతల్లి పిల్లలు తీసేసుకున్నారని, తమకు వాటా ఇప్పించాలని రామభద్రపురం మండలం చెదరడవలస గ్రామానికి చెందిన బి.గున్నమ్మ కోరింది. భూ రీసర్వేలో తమ భూమి తక్కువగా చూపిస్తున్నారని, సరి చేయాలని సీతయ్యపేట రైతు సూర్యనారాయణ కోరారు. తమ సాగులో ఉన్న భూమిని కొంతమంది ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని, ఆక్రమణకు గురికాకుండా చూడాలని ఒకమహిళా రైతు కోరారు. తమ భూమిని వేరొక వ్యక్తి పేరుమీద ఆన్‌లైన్ చేశారని, తమ భూమి తమ పేరు మీద ఆన్‌లైన్ చేయాలని ఎరకందొరవలస గ్రామానికి చెందిన గిరిజనులు ఎస్.పెదగోపమ్మ, ఎస్.భద్రమ్మ, కె.కామేష్, ఎస్.లచ్చుందొర, ఎస్.రాజారావు కోరారు. భూసమస్యలను పరిష్కరిస్తామని ఆర్‌డిఒ శేషశైలజ హామీ ఇచ్చారు.

అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

గిరిజనులపై దాడి చేసిన అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద గిరిజనులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు సురేష్ మాట్లాడుతూ బాడంగి మండలం ఆకులుకట్ట సమీపంలో అటవీ భూములలో సాలూరు మండలం చింతమాల గ్రామ గిరిజనులు రెండేళ్ల నుంచి స్థావరాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారని, వారిపై అటవీశాఖ అధికారులు దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేయడం దుర్మార్గమన్నారు. అటవీశాఖ అధికారుల దాడిలో ఇద్దరు గిరిజన మహిళలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారని చెప్పారు. గిరిజనులపై దాడులు చేసిన అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని, గిరిజనులు జీవనానికి స్థావరాలు కోసం అనుమతులివ్వాలని ఆర్‌డిఒ శేషశైలజను కోరారు.

ధర్నా చేస్తున్న నాయకులు, గిరిజనులు

విశాఖ వాసి అనుమానాస్పద మృతి

కొత్తవలస: మండలంలోని చీపురువలస వద్దగల బిఎస్ఎన్ గార్డెన్స్ లో గల నీటి కొలనిలో ఇంటి గణేష్ (40) అనుమానస్పదంగా సోమవారం సాయంత్రం మృతి చెందారు. ఎస్ఐ సిహెచ్ హేమంత్ కుమార్ అందించిన వివరాలు ప్రకారం. విశాఖకు చెందిన ఇంటి గణేష్‌తో పాటు పదిమంది బిఎస్ఎన్ రిసార్ట్స్‌లో శనివారం దిగారు. ఆదివారం ఉదయం తప్ప తాగిన మైకంలో ఇంటి గణేష్ రిసార్ట్స్‌లో ఉన్న కొలనీలో దిగి మృతి చెందాడు. ఈ కొలనీలో తేలాడుతున్న వ్యక్తిని తోటి స్నేహితులు స్థానిక ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించిన అప్పటికే చనిపోయారు.

పిడుగు పడి కూలీ మృతి

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని వీలుపర్తి పంచాయతీ పరిధిలోని దుంగాడ క్వారిలో పనిచేస్తున్న కె. భాస్కర్(22)పై సోమవారం సాయంత్రం పిడుగు పడి మృతి చెందారు. అనకాపల్లికి చెందిన భాస్కర్ ఈ క్వారీలో కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఉరుములతో కూడిన వర్షం పడిన సమయంలో బయట పని చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.